
ఈవారం కథ

# ఊరేగింపు



—ఎస్. నూర్ అహ్మద్

మొన్నటి రోజునే ఉప ఎన్నికలు ముగిసిన ఆ పట్టణంలో ఎటు చూసినా కనిపిస్తున్న కాగితపు తోరణాలు పురి దారానికి ఉరి వేసిన బడుగుజీవుల ఆశల్లా గాలికి రెపరెపలాడుతున్నాయి. ఆ పట్టణం గుండె గోడలపై రాసిన ఎన్నికల నినాదాలు ప్రజాస్వామ్యానికి రాసిన మరణశాసనంలా కన్పిస్తున్నాయి. ఎన్నికలు ముగిసినా ఫలితాలు రాని ఆ పట్టణంలో తుపానుకు ముందు ప్రశాంతత నెలకొని వుంది.

అప్పుడు సమయం రాత్రి 10 గంట లయింది.

ఆ సమయంలో మెయిన్ రోడ్డుకు ప్రక్కనున్న ఫుట్ పాత్ పై ముణగదీసుకుని పడు కున్నాడు హనుమంతప్ప. కడుపులో ప్రేగుల్ని నులిపెడుతున్న ఆకలిబాధ ను తట్టుకోలేక బోరింగ్ నీళ్లను కడుపునిండా తాగినా నీరసం విడవకపోవడంతో నిస్సత్తువగా ఫుట్ పాత్ పైనే వాలిపోయివున్నాడతను.

మగతగా పడివున్న అతని చెవులకు ఆ రోడ్ నుంచి అప్పుడప్పుడు వెడుతున్న వాహనాల చప్పుడు వినిపిస్తూనే వుంది.

ఇంతలో డప్పుల చప్పుడుతోపాటుగా జయ జయధ్వానాలూ, అరుపులూ, కేకలూ, టపాసుల పేలుళ్ళూ అతని చెవులకు లీలగా సోకాయి.

ఎక్కడో దూరంగా విన్పిస్తున్న ఆ చప్పు శబ్దాలకే హనుమంతప్ప ఉలిక్కిపడి కళ్ళు విప్పాడు. కళ్లు తిరిగినట్లు అన్పిస్తున్నా మెల్లగా లేచికూర్చుని చెవులు రిక్కించి ఆ శబ్దాన్ని విన్నాడు. అవును అది ఊరేగింపే, ఓట్ల లెక్కింపు ముగిసిపోయినట్లుంది. గెలిచిన నాయకుణ్ణి ఊరేగిస్తున్నట్లుంది.

ఈ ఎన్నికలలో గెలిచింది ఎవరైనా తనను జీవితంలోనే ఓడిపోయేట్లు చేసాయి ఈ ఎన్నికలు. తాను కూర్చొన్న చోటు నుంచి తల తిప్పి ఆ ఫుట్ పాత్ గోడపై దృష్టి సారించాడు.

ఆ గోడలపైనే తన గత జీవితపు గుర్తులు మిగిలి వుండేవి.

కానీ అవి కన్పించకుండా వాటిపై సున్నం కొట్టారు, నినాదాలు రాశారు.

వాటిని చూస్తున్న అతని కళ్లల్లో తిరిగిన నీళ్ళు దృష్టిని మందగింపచేశాయి.

దానితోపాటే గతాన్ని అతని కళ్లముందు సాక్షాత్కారింపచేశాయి.

అనంతపురం జిల్లాలో చెప్పుకోదగ్గ పట్టణంగా వున్న ఆ పట్టణంలో బీదసాదలు అందరికీ హనుమంతప్ప హోటల్ గురించి తెలుసు. చౌక ధరలతో రుచికరమైన ఉపాహారాలు అతని హోటల్ లో దొరుకుతాయి. బీద సాదలే కాక చిన్న ఉద్యోగులు కూడా రోజూ అతని హోటల్ కు వస్తుంటారు.

ఫుట్ పాత్ కు ఆనుకొనివున్న గోడను ఆసరాగా చేసుకుని తడికెలతో కట్టిన అతని హోటల్ లోపల బండలుపరచిన రెండు టేబుళ్ళు, వాటికి అటూ ఇటుగా కూర్చోవడా నికి పాత చెక్కబల్లలు వుంటాయి. దానికితోడు ఆ హోటల్ కప్పుపై పరచిన గడ్డి కంతల నుంచి లోపలకుపడే వెలుగురేఖలు ఆ హోటల్ కే అందాన్ని ఇస్తాయని అక్కడకు వచ్చే వారు చెప్తుంటారు. ఐదారుమందికంటే ఎక్కువ మంది సుఖంగా కూర్చోలేని ఆ హోటల్ లో ఒకసారికి పది

పన్నెండు మంది ఎలాగో సర్దుకుని కూర్చుంటుంటారు. ఉదయం కొంత సేపు, సాయంత్రం కొంతసేపు హనుమంతప్ప భార్య అక్కడికి వచ్చి టిఫెన్లు తయారు చేయడంలో అతనికి సాయపడి వెళ్తుంటుంది. మధ్యాహ్నం అతనే స్వయంగా బజ్జీలు వేసి అమ్ముతుంటాడు. ఐదుమంది కుటుంబ సభ్యు లున్న హనుమంతప్ప ఇంటికి ఆ హోటల్‌పై వచ్చే ఆదాయం బొటాబొటీగా సరిపోతుండ డంతో అతని కుటుంబానికి పేదరికం పీడ తప్పలేదు.

ఇంతలో ఉప ఎన్నికలు వచ్చాయి.

ఆ ఊరి ఎం.ఎల్.ఎ. హఠాత్తుగా చనిపోవ డంతో అతను పోయిన మూడు నెలలకు ఎన్నికలు ప్రకటించారు. ఉప ఎన్నికలంటే పట్ట ణంలో హడావుడి పెరుగుతుందనీ, అలాగే తనకు గిరాకీ మరింతగా పెరుగుతుందనీ సంబర పడ్డాడు హనుమంతరావు.

ఆ ఊళ్ళో అంతవరకూ సారా కింగ్‌గా వున్న కదిరప్పకూ, వీధి గూండాలను వెంటేసు కుని దర్బారు చెలాయించే నాగరాజుకూ రెండు ప్రధాన పార్టీల టిక్కెట్లు లభించాయి. రంగంలో స్వతంత్ర్య అభ్యర్థులు వున్నా పోటీ ప్రధానంగా వీరిద్దరి మధ్యే వుంది.

ఎన్నికలు ఇంకా నెల రోజులు వుండగానే వీరి ప్రచారం మొదలయింది.

*    *    *    *

ఆరోజు సాయంత్రం కాస్త వ్యాపారం తక్కువగా వుండడంతో ఒకింత నిరుత్సాహంతో కూర్చొన్న హనుమంతప్పలో ఉత్సాహం రగిలిస్తూ కదిరప్ప తాలూకు పార్టీ కార్యకర్తలు హోటల్‌లోకి వచ్చారు.

పగలంతా తిరిగారేమో ఆ హోటల్‌లోనే టిఫిన్లు చేశారు. టీ, కాఫీలు తాగారు.

బిల్లు తొంభైఐదు రూపాయిలు అయితే వంద రూపాయిలు ఇచ్చేశారు.

ఆ తర్వాత ఆ హోటల్ తడికె గోడలపై తమ పార్టీ నాయకుడి పోస్టర్లను అంటిస్తామని వారు హనుమంతప్పను అడిగారు.

అయితే అది అభ్యర్థనలా కాకుండా హెచ్చరికలా వుండడంతో భయంగానే తలూపా డతను. ఆ తడికలపై పోస్టర్లు అంటించడమే కాకుండా ఫుట్‌పాత్ గోడలపై అంతా తమ పార్టీ నినాదాలు రాసి వెళ్లిపోయారు... రెండు రోజుల తర్వాత పట్టణంలో కదిరప్ప, నాగరాజు గ్రూపుల మధ్య చిన్న ఘర్షణ తలెత్తింది. ప్రచార నినాదాలు రాసుకోవడానికి నాగరాజు గ్రూపు మనుషులు కొన్ని గోడలను రిజర్వ్ చేసి ఉంచితే వాటిపై

ఎందుకు!
అన్న ప్రశ్న లేకపోతే అసలు తత్వశాస్త్రమే లేదు.
ఆ ప్రశ్నపైనే అనిమర్ధుని జీవయాత్ర నడిపాను.
సీతారామయ్యకు - అన్నింటిని ప్రశ్నించుకోమన్నాను.
ఎందుకు?
వివేకం కోసం - విజ్ఞానం కోసం - తెలియని దాన్ని అన్వేషించడం కోసం
విజ్ఞానం ఎందుకు?
ఆనందం కోసం. మనస్సు ఎదగడం కోసం
ఆనందం ఎందుకు?
సమాధానం లేదు.
కాని ఉంటుంది - అయితే ఆ తరువాతైనా ఇది ఆగిపోతుంది.
ఈ 'ఎందుకు?'
అన్నది ఎక్కడో ఒక చోట - ఆగిపోవల్సిందే.
అది ఎక్కడ ఆగిపోతుందో —
అక్కడ నుంచి మనిషి పురోగమనాన్ని కొలవవచ్చు —
— గోపీచంద్

కదిరప్ప మనుషులు తమ నినాదాలు రాసారట. అదీ గొడవకు మూల కారణం.

దాంతో వారు కొట్టుకోవడంతోపాటు ఒక పార్టీ నినాదాలను, మరో పార్టీవారు చెరిపివేయ డానికీ, నాశనం చేయడానికీ ఉద్యుక్తులై పట్ట ణంలో పరుగులు పెట్టారు.

రాత్రి తొమ్మిది గంటలప్పుడు హను మంతప్ప డబ్బు లెక్కపెట్టుకుంటున్నాడు.

ఆ రోజైన కలెక్షన్లతోపాటుగా ఖాతాపెట్టి తినే ఉద్యోగులకు జీతాలు రావడంతో వారు తెచ్చి ఇచ్చిన డబ్బు కూడా జమవేసి లెక్క పెడుతున్నాడతను. మొత్తం పదిహేను వందల రూపాయిలదాకా వుందాడబ్బు. అదే అతని పెట్టుబడి. అతని జీవనాధారము కూడా. 'గతంలో అతనో హోటల్‌లో సర్వర్‌గా పని చేశాడు. చాలాకాలంపాటు ఆ హోటల్‌లో పని చేసిన అతనికి వున్నట్లుండి ఆరోగ్యం తిరగబెట్ట డంతో కడుపుకు ఆపరేషన్ చేయవలసి వచ్చింది. చాలా రోజులు మంచంలోనే ఉండి పోయిన అతను కోలుకొని తిరిగి ఆ హోటల్‌కు వెడితే పని ఇవ్వం పొమ్మన్నారు. అలాంటి సమయంలో తన భార్య పుట్టింటి నుండి తెచ్చు కొన్న కొన్ని సొమ్ములు, సామానులు అమ్మగా వచ్చిన డబ్బును పెట్టుబడిగా పెట్టి ఈ హోటల్ తెరిచాడతను.

ఆ డబ్బే అలా తిరుగుతుంటుంది. దానిలోనే సామాన్లు కొని హోటల్ నడుపు తుంటాడు.

ఏదో ఆలోచిస్తూ డబ్బు లెక్కపెడ్తున్న అతనికి ఏం జరుగుతూందో అర్థం అయ్యే లోపలే నాగరాజు మనుషులు కొందరు హోటల్‌లోకి దూసుకొచ్చారు.

వచ్చీ రాగానే హోటల్‌లో కదిరప్ప వర్గం వారు అంటించిన పోస్టర్లను చించేశారు. అయినా వారి ఆగ్రహం తీరినట్లు లేదు.

వారిలో ఒకడు హనుమంతప్పను స్టూలుపై నుండి క్రిందకు తోసేశాడు. వెల్లకిల పడిన అతనిపై పడి ఇద్దరు ముగ్గురు వ్యక్తులు అతని చేతుల్లోని డబ్బు లాక్కొన్నారు. ఏడ్చి మొత్తుకుంటున్న అతన్ని బయటకు లాగేశారు. అతని కళ్లముందే ఆ హోటల్ అంతా ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా, ఆ హోటల్‌కూ, అందులోని సామానులకూ నిప్పు పెట్టారు.

క్షణాలలో హనుమంతప్ప జీవితాన్నే కాల్చి బుగ్గి చేశారు. మరునాటికి ఆ గొడవలు చల్లబడ్డాయి.


ఆ తర్వాత రోజున హనుమంతప్ప తన భార్యాపిల్లలతో నాగరాజు దగ్గరికెళ్లాడు. తన గోడు చెప్పుకొన్నాడు. ఏడ్చి మొత్తుకొన్నాడు.

అయితే అతని పరిస్థితిపట్ల సానుభూతి చూపినట్లు నాగరాజు నటించినా అతనికి ఎలాంటి సహాయం చేయకపోగా, విధ్వంసాలు చేసింది తమవర్గం వాళ్లే కాదన్నాడు. అదంతా ఎదుటిపక్షం వారి కుట్ర అని అన్నాడు. చేసేదేమీ లేక హనుమంతప్ప వెనుదిరిగాడు. ఇక తనకు కదిరప్పను కలవడం మినహా మార్గమేమీ లేకపోవడంతో అతన్ని వెళ్లి కలిశాడు.

కదిరప్ప కూడా అతనిపట్ల సానుభూతి చూపి సహాయం ఏమీ చేయలేదు. అయితే ఈ నెలరోజులూ తన తరఫున పనిచేస్తే రోజూ యాభై రూపాయిలు ఇస్తామని చెప్పాడు. ఉప ఎన్నికల పుణ్యమా అని ఉపాధి కోల్పోయిన అతను మరో గత్యంతరం లేక ఆ పనికి ఒప్పు కొన్నాడు. కానీ ఇరవై రోజులుగా అతను కదిరప్ప తరఫున ప్రచారంలో పనిచేస్తున్నా ఏనాడూ ఒక్క రూపాయికూడా ఎవరూ ఇవ్వ లేదు అతనికి. అయితే భోజనం పొట్లాలు మాత్రం ఇచ్చేవారు. అలాగే తాగేవారికి సాయంత్రం సారా పోయించేవారు.

ఈ ఇరవై రోజుల్లోనే అతని కుటుంబం పరిస్థితి దారుణంగా తయారయింది.

ఇంట్లో పూటగడవడం కష్టం కావడంతో రెండు మూడు రోజులు అప్పులు చేశారు. కానీ అది కూడా కరవు కావడంతో కాస్త విలువైన సామానులు అన్నీ అమ్మి తినడం ఆరంభించారు. ఈ విధంగా చేయడంతో అతని ఇంట్లో ఏమీ



మిగలలేదు. అతనూ అతని భార్యా ఎలాగో పస్తులకు తట్టుకోగలిగినా చిన్న పిల్లలూ, ముసలివారైన అతని తల్లిదండ్రులూ ఆకలికి తాళలేక పడే బాధలు అతని మనసునెంతగానో క్షోభపెట్టాయి. ఆరోజుఉదయం తన తండ్రి కళ్లు తిరిగి పడిపోయాడు. ఆయన్ని ఆస్పత్రికి తీసుకెళ్లి అక్కడ జాయిన్ చేశాడు. అతని తండ్రిని పరీక్షించిన డాక్టర్ అతను తిండి తినకపోవడంవల్లనే రోగం తిరగబెట్టిందని తేల్చేశాడు.

ఆ మాటలు విని మనసులోనే ఏడ్చుకున్నాడు హనుమంతప్ప.

ఇంకో రెండు రోజులు తిండి లేకపోతే తమ కుటుంబమంతా ఆకలి చావులపాలవుతుంది. అందుకే రేపటి పోలింగ్ హడావుడిలో వున్న కదిరప్పను కలిసాడు. కదిరప్ప అతని మాటలు విన్పించుకోకుండానే ఎన్నికలలో డబ్బు లెక్కలు చూసే తన బామ్మర్దిని చూడమన్నాడు.

అతను "తాగితే ఎంత తాగుతావో తాగు, లేకపోతే తిను, అంతేగాని డబ్బు ఇచ్చేది మాత్రం లేదు" అని తేల్చి చెప్పేసాడు.

ఆ తర్వాత పోలింగ్‌నాడు ఓటుకు పది రూపాయిల చొప్పున రాగా ఆ రోజు తన ఇంట్లో అన్నం తిన్నారు. అది జరిగి కూడా మూడు రోజులయింది. ఈ మూడు రోజులు కూడా పస్తులుండడం తప్పలేదు.

మూడు రోజులుగా ఏమీ తినని అతని కడుపు అతని వంట్లోని శక్తినంతా మింగేసినట్లు అతన్ని నిర్వీర్యపరచింది.

ఊరేగింపు చాలా దగ్గరికి వచ్చేసినట్లు శబ్దాలు విన్పించడంతో గతం నుండి బయటపడి తల తప్పి చూసాడు హనుమంతప్ప.

ఆ ఊరేగింపులో అలంకరించిన జీపుపై నిలబడి దండాలుపెడుతున్నాడు కదిరప్ప. ఆ జీపు వెనక జనం. వారి వెనుక కొన్ని కార్లు ఉన్నాయి. అలాగే, ఆ జీపుకు ముందు పెట్రోమాక్స్ లైట్లు పట్టుకున్న కూలీలు, వారి ముందు డప్పులు కొడుతున్న వాద్యగాళ్ళు, అంతకంటే ముందు బాగా తాగి ఆ డప్పుల శబ్దాలకు అనుగుణంగా చిందులు వేస్తున్న రౌడీలు; తమదే రాజ్యం అన్నట్లుగా టపాసులు పేలుస్తున్న కుర్రగూండాలు వస్తున్నారు. అక్కడక్కడా పోలీసులు కూడా కన్పిస్తున్నారు. ఆ దీపాల వెలుగులో కదిరప్ప వెలిగి పోతున్నాడు.

ఈ ఊరేగింపులో ఇవేమీ హనుమంతప్పను ఆకర్షించలేదు. కదిరప్ప మెడలో వేసిన 'నూరు రూపాయిల నోట్ల దండ'పైన అతని దృష్టి పడింది. అందులో ఒక్క నోటుంటే చాలు తమ కుటుంబం రెండు రోజులు ఆకలి బాధ లేకుండా గడుపుతుంది.

ఆలోచిస్తూనే మనసులో ఓ నిర్ణయానికి వస్తున్నాడు హనుమంతప్ప. ఊరేగింపు అతనికి చేరువలోకివచ్చేసింది. అలాగే కదిరప్ప మెడలోని పచ్చనోట్ల మెరుపులు కూడా అతనికి మరింత చేరువ అయినట్లనిపించింది.

అతని ఎదురుగా ఊరేగింపు సాగిపోవడం మొదలయింది.

టపాసులు కాల్చే గూండాలు, తాగి, చిందు లేస్తున్న రౌడీలు, వాద్యగాళ్ళు, లైట్లు మోస్తున్న కూలీలు తనను దాటేవరకూ మౌనంగా ప్రహరీ గోడకు ఆనుకొని నిలబడ్డ హనుమంతప్ప కదిరప్ప జీపు తనకెదురు కాగానే ఏదో శక్తి ముందుకు తరిమినట్లు తూలి పోతూనే పరుగుపెట్టాడు. జీపు ముందు భాగం నుంచి సులభంగానే అతను పైకి ఎక్కి బ్యానెట్‌పై నిలబడి, మరుక్షణంలోనే కదిరప్పపై పడ్డాడు.

నోట్ల దండలాగే ప్రయత్నంలో అతన్ని కాలర్ పట్టుకొని ముందుకు లాగడంతో కదిరప్పకు జీపు అద్దం పై భాగం తగిలి నోటి నుండి రక్తం కారింది.

ఓ క్షణకాలం ఏం జరిగిందో ఎవరికీ అర్థం కాలేదు.

అయితే "నన్ను చంపేస్తున్నాడ్రోయ్... రండిరా...రండి" అని కదిరప్ప రంకెలు వేయడంతో రౌడీలూ, గూండాలూ పరుగున వెనక్కి వచ్చి హనుమంతప్పను క్రిందకు లాగారు!

ఎవరికి వారే అతన్ని తన్నడం మొదలెట్టారు.

ఇంతలో పోలీసులు వచ్చి కలగజేసుకున్నారు.

అప్పటికే ఆ గూండాలూ, రౌడీలూ ఎక్కడెక్కడ తన్నారోగానీ హనుమంతప్ప నొప్పితో గిలగిల్లాడిపోతున్నాడు.

నోటివెంట చొంగలు కారుస్తున్నాడు.

అయినా ఓ వంద నోటు అతని పిడికిట్లో గట్టిగా పట్టుకున్నాడు. కానీ ఆ నోటు సగం చిరిగిపోయిందనీ, అది చెల్లదనీ అతనికి తెలిసే అవకాశం లేదు.

అతన్ని పోలీసులు తీసుకెళ్ళి ఆస్పత్రిలో పడవేశారు. చావు బ్రతుకుల మధ్య ఊగిసలాడుతున్నాడు హనుమంతప్ప. సరిగ్గా అదే సమయానికి కదిరప్ప తనను కలువడానికి వచ్చిన జిల్లా విలేకరులతో ఈ సంఘటన గురించి ఉద్వేగంగా చెపుతున్నాడు.

"వాడు ఎగస్పార్టీ మనిషండీ, వాడిని చూడగానే నేను అనుమానపడ్డాను. అంతలోనే వాడు జీపుపైకి ఎక్కి నన్ను కత్తి తీసుకుని పొడవబోయాడు. అయితే నేను తప్పించుకొని అతని చేతిలోని కత్తిని క్రింద పడవేశాను. ఆ ప్రయత్నంలో నాకు దెబ్బ తగిలింది". చిట్లిన పెదవి చూపిస్తూ చెప్పాడు. "ఇదిగో అతను తెచ్చిన కత్తి" అని చూపి దానిని పోలీసుల పరం చేశాడు. "వాడు నన్ను చంపబోతే నా పార్టీ కార్యకర్తలే నన్ను రక్షించారు. వారికి నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను." ఆ మాటలకు అక్కడున్నవారంతా చప్పట్లు కొట్టారు.

ఆ మరుసటి రోజు ఎవరికీ పట్టని మున్సిపాలిటీ ట్రాక్టర్‌లో వేసిన హనుమంతప్ప శవం వెనుక అతని తల్లీ, భార్యా, పిల్లలూ ఏడుస్తూ వెళుతున్నారు.

"తొలి రోజే ఎం.ఎల్.ఎ.పై హత్యా ప్రయత్నం, హంతకుడు ఆస్పత్రిపాలు" అనే పేపర్లలోని అక్షరాలూ, గోడలపై నినాదాలూ నిశ్శబ్దంగా చూస్తుంటే, కాగితపు తోరణాలు రెపరెపలతో అతడికి తుది వీడ్కోలు చెప్తున్నాయి.

లోకానికి తెలియని నిజంపై గుడ్డకప్పి, దానిని సమాధి చేయడానికి వెళ్తున్న ఆ శవం ఊరేగింపు ఊరుదాటి వెళ్లిపోయింది. ◆

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి
భీమ సిమెంట్